# ఇద్దరు గొప్పవాళ్లు

'నాపేరు రామయ్య...నేను చాలా గొప్పవాణ్ణి...'

'నా పేరు గోపాలం...నేనుకూడా చాలా గొప్పవాణ్ణేను....'

'నమస్కారమండీ.......మిమ్మల్ని కలుసుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది...'

'నమస్తే....మీతో పరిచయం అయినందుకు నాకు అట్లాగే ఉంది....'

'మీరు దేంట్లో గొప్పవాళ్లో వినాలని కుతూహలంగా ఉంది.'

'నాపేరు కలంశ్రీ...'

రామయ్యముఖం ఆనందంతో విలవిలలాడింది.

'మీరు కలంశ్రీగారా...!!! అట్లా కూర్చోండి....మీరింకా చాలా ముసలాళ్లనుకుంటున్నాను... అరె ......నాకు బోలెడు ఆశ్చర్యంగా ఉంది...'

'మీసంగతి చెప్పారుకాదు....'

'నేను సినిమా తీద్దా మనుకుంటున్నాను. పల్లెటిదిక్కన హీరోయినుకు సరిపోయేవాళ్ళెవరన్నా దొరుకుతారేమోనని....ఇట్లా వచ్చాను.. మీదీ ఊరేనా'

'మాది హైదరాబాదు.... ఈ ఊళ్లో కథలేమయినా దొరుకుతాయేమోనని వచ్చాను....'

'ఇద్దరు గొప్పవాళ్లం ఇలా కలుసుకోవడం .... నిజంగా .... చాలా గొప్ప సంగతి.... మనిద్దరం ఫొటో తీయించుకుందాం.... నా సినిమాకు మీరు కథ వ్రాయాలి....'

'నేను వ్రాయబోయే కథను మీరు సినిమా తీయాలి....'

'రాసినవేంలేవా మీదగ్గర....?'

'లేకేం బుట్టెడున్నాయి.... అవన్నీ పట్టణ వాతావరణం.... సినిమాతీస్తే సెన్సారువాళ్లు వప్పుకోరు....'

'మరి ఏమిటిచెయ్యడం....'

'ఈ ఊళ్ళో ప్రపంచఖ్యాతి పొందగలిగే కథ దొరుకుతుంది....'

'ఎక్కడ ....'

'అదితెలిస్తే ఇంకేం.... అందుకోసమే అన్వేషణ....'

'మన సినిమాపేరు ఏంపెడదాం....'


'సోమలింగం....'

'మరీ మోటుగా ఉంది ...'

'మీకు తెలియదు.... దాంట్లో బోలెడంత ఐడియాఉంది.'

---

ఇసుకపల్లి దక్షిణామూర్తి



'నాకుగూడా తెలిసే అయిడియా తీద్దాం....'

'సరే కథదొరకనీండి....'

'పదండి.... అలస్యం అమృతం విషం....'

'ఆమాట అందిఎవరో తెలుసామీకు..'

'నాకేం తెలుసండి....'

'నే నీమధ్య వక కథలో'రాశాను.... దాం తర్వాతే ఆసామెత పదిమంది నోళ్ళలో పడింది!'

'నిజంగా..'

'రేపు మళ్ళీ కలుద్దాం....'

'చీకటి వానలాగా పడుతోంది. వెన్నెల పాలనదిలాగా పాకుతూ వస్తోంది' గోపాలం చీకటివంక, పాలిపోయినట్లు కనబడే చంద్రుడివంక చూసి వదిలిన అయిడియా ఇది. దీంట్లో నిగూఢార్థం చాలాఉంది. చీకటిఅంటే కష్టాలు, దుఃఖాలు, దరిద్రం వగైరాలు. అవి వానలాగా పడటమంటే వానవచ్చే ముందు కమ్ముకువచ్చే నల్లని మబ్బులాగా రావటం-వానరావటంలో నిదానం, దుడుకుతనం ఉన్నట్లుగానే కష్టాలరాక గూడా ఉంటుంది. వెన్నెలరావటం అంటే దుఃఖాన్ని పారద్రోలటం. అదీ మెల్లిగా ప్రియురాలి చేతి మృదు స్పర్శలాగా....ప్రియురాలు లేనివాళ్ళకిది అర్థం కాదు. కలంశ్రీ భావనలో ఇంకా ఇటువంటి అర్థం చాలాఉంది. అర్థం లాగిన కొద్దీ వస్తుంది. అందులో రచయిత ఉపజ్ఞకంటె పాఠకుని ఉత్కంఠ ఎక్కువ ఉపకరిస్తుంది. లేకపోతే కట్టుకున్న పెళ్ళాంచెయ్యి తాకితే ఉన్నట్లు మందంగా ఉంటుంది.

గోపాలం ఆ ఊరివైపు చూశాడు. కథ వెతకపోతే ఫిలిం ప్రొడ్యూసరు కాళ్ళకు చుట్టుకున్నాడు. ఏమైనాసరే తెల్లారేసరికి కథ సాధించాలి.

పొలం గట్టుమీదుగా ఊరివైపుకు నడిచాడు. కొబ్బరిచెట్లు గాలికి తలలాడిస్తున్నాయి. గోపాలం ధీరుడిలాగా రొమ్ము విరుచుకుని నడుస్తుంటే గట్టు మీదనుంచి ఏదో జంతుజాలం కిందకి దూకుతోంది. ఒక్కచోట పాము కనబడింది. భయపడితే పలకరించే దిక్కులేదని ధైర్యంచేసి పక్కగుండా ఊరు చేరుకున్నాడు.

మంచి కథ కావాలి. నిజంగా జరిగింది వ్రాస్తే దాంట్లో మజాఉంది. కోర్టు వ్యవహారాల్లో చిక్కుకోకుండా 'ఇందలి పాత్రలు కేవలం కల్పితాలు' అని వ్రాసుకోవచ్చు. రావిచెట్టుకింద ఎవరో చుట్ట కాలుస్తూ కూర్చున్నాడు. వకతె చిట్టిగారెలు చేస్తోంది. వాళ్ళ లైఫ్ వ్రాస్తే! చుట్టకాల్చేవాడి పెళ్లాం వాడిని అనుమానించింది. భావిలోదూకి చచ్చిపోతానంది. 'సరే నీ ఇష్టం...' అని ఇక్కడకువచ్చి చుట్టకాలుస్తున్నాడు. తరువాత తగాదా ఎందుకు వచ్చిందో ఆయన్నే అడుగుతే?

'ఏమిటయ్యా సంగతులు...'

'ఏవూరు మనది....'

'హైదరాబాదుగాని...నీ పెళ్లాం....'

'మాటలు సరిగ్గారానీ...నా పెళ్ళాం ఊ సెత్తావంటేనా....'

'అదికాదు....మీకు తగాదా ఎందుకు వచ్చింది....'

'ఎవడుచెప్పాడయ్యా మాకు తగాదా వచ్చిందని....ఎక్కడో పిచ్చోడిలాగా ఉన్నావే....'

గోపాలానికి ఏడుపువచ్చింది. కాని చోటు. మహా ఉక్రోషం వచ్చింది. వాడి కథ రాయకూడదనుకున్నాడు.

అట్లా బయలుదేరి పోతుంటే ఎక్కడా కథ దొరకటంలేదు ఒక గుడివచ్చింది. పెద్దధ్వజస్తంభం. పైనగంటలు ఊగిస లాడుతున్నాయి. కింద జనసమ్మర్దంగా వుంది. అందులో ఆ అమ్మాయి ఎవరు? శ్రీకాంతలో రాజ్యలక్ష్మిలాగా ఉందే! దిగులుగా కనబడింది. ఏదో బరువు ధైర్యంగా మోస్తోంది. ఏమిటో ఆ అమ్మాయికథ! బుచ్చిబాబుని ఎవరో అమ్మాయి కథ వ్రాయమని అడిగిందిట. నన్నడగక్కర్లేదు. గోపాలం తను కథలువ్రాసే పేరు చెబుదామా వద్దా అని ఆలోచించాడు. ఆ పేరు వినగానే సంతోషంపట్టలేక ఆశ్చర్యంతో పడిపోతే తనేదో చేశాడంటారు. లోకులు కాకులు.

ఒకచేతిలో పూలబుట్ట. అందులోనే కొబ్బరికాయ. ఆ ఫిలిం ప్రొడ్యూసరు వచ్చేటప్పుడు కెమేరా తీసుకునివస్తే ఇక్కడే సగంసినిమా తియ్యటం అయి పోయేది. గోపాలం మెల్లిగా అక్కడకు వెళ్లాడు. ఆ అమ్మాయి ఇతన్ని చూడ కుండా గుడి మంటపం మెట్లమీద కూర్చుంది.



"మేము వరాలిచ్చే దేవతలం కాము; నేనూ మీలాంటి మానవుణ్ణే; మీలాగే నాకు ఒక తల ఉంది; నేనూ ఒక లాల్చీ వేసు కున్నాను.........."

"సార్! మీరు పదవికి రాకముందు నాకు రెండు లాల్చీలు ఉండేవి!...."

---

'మీతో కొంచెం మాట్లాడాలి...'

ఆ అమ్మాయి కంగారుపడుతూ లేచి నుంచుంది.

'మీరు రాజ్యలక్ష్మిలాగా ఉన్నారు..'

ఆ అమ్మాయి ఇంకా తెల్లబోయింది.

'మీ కథ వ్రాస్తాను....'

'అన్నయ్యోవ్....' అంటూ కేక పెట్టింది. గోపాలం గుండె ఆడటం మానేసి హడలిపోయి నోట్లోకి వచ్చి దాక్కుంది.

'అన్నయ్య' వచ్చాడు. రాధ వెళ్ళి పోతానంటుంటే వద్దని కృష్ణుడు వారి స్తున్న పోజులో ఉన్నాడు గోపాలం.

ఆ అమ్మాయి అన్నయ్య గోపాలం మెడకు బెత్తెడు ఎడంగా వకచేసి మనిషిని తనవైపుకు తిప్పుకుని, కాలరు పట్టుకుని, అతని శరీరాన్ని పైకెత్తాడు. గోపాలం మునికాళ్లమీద నిలబడ్డాడు.

'ఎవర్రా నువ్వు ...'

'ఒకటి తగలనీరా మాటొస్తుంది...'

'డొక్కచిరగ తన్నండ్రా....'

గోపాలం వాళ్లందరివంకా చూశాడు. ఆ వాతావరణం ఎంతో సహజంగాఉంది. వచ్చిన వాళ్లు. అంతా గొప్ప నటుల్లాగా ఉన్నారు. కథలో ఒక దృశ్యం ఇది. వీళ్ళు చంపకుండా వదిలి పెడితే కొంతకథ వ్రాయవచ్చును.

'ఎవరింటి కొచ్చావు....?'

ఆ అమ్మాయిని పిలిచారు.

'ఏమిటి వీడు అనేది....'

నాకథ రాస్తాడట....' అమ్మాయి గొంతు బాగానే ఉందనుకున్నాడు గోపాలం.

'కథలు రాస్తావ్రానువ్వు.... వీడి ముఖం చూడ దర్రా అంతాను....' అన్నయ్య గోపాలం కాలరు పట్టుకుని అందరివైపు తిప్పాడు.

'మళ్ళీ ఇటువచ్చావంటే ఇంకేం లేదు....పో....' అన్నయ్య గోపాలాన్ని వక్కతోపు తోశాడు. ఆ సీనుసంగతి ఆలోచించుకుంటూ బయట పడ్డాడు.

అతని మెదడులో నక్షత్రాలు తళుక్కు తళుక్కు మంటున్నాయి. చంద్రుడు సూర్యుడు లాగా ఉన్నాడు వెన్నెల చీకటిలాగా ఉంది.

ఎవరికథ వ్రాయడం...ఎట్లా....ఎట్లా ....అతని హృదయం ఆవేదనతో నిండిపోయింది. తర్వాత పొర్లిపోయింది ఆపైన బోర్ల పడింది.

అలా వంటరిగా ఊరిచివరకు నిరాశగా నడిచిపోతుంటే.... ఎవరు పిలిచింది? వెనక్కుతిరిగి చూశాడు. 'ఇక్కడ'.... ఎక్కడ.? గోపాలం అంటూ ఇటూ చూశాడు.

చిన్నపాకలో వెదురుపుల్లల కిటికీలో నుంచి అందం తొంగి చూస్తోంది. గోపాలం అట్లాగే ఒకక్షణం చూశాడు. కళ్ళు పిలుస్తున్నాయి. గోపాలం వళ్ళు అటువైపు నడిచింది.

ఎవరునువ్వు? గంధర్వ కన్యవా. అప్సరసవా....ఈ భూలోకానికి వచ్చిన శాపకారణం ఏమిటి? నిన్నీ గుడిసెలో బంధించిన దుష్టుడు ఎవరు? గోపాలం జానపదకథ వ్రాస్తే బాగుంటుంది అనుకున్నాడు. మళ్లీ వెన్నెల కనబడింది. చుట్టుప్రక్కల జనసంచారంలేదు. తను పురుషుడు. ఆమె ప్రకృతి. ఇదే సృష్టి. బ్రహ్మగాడు చేసేపనే ఇది. కథ చెప్పమని ముందరే అడిగితే వాళ్లఅన్నయ్యని పిలుస్తుందేమో! తెలివితేటలు అంటే

ఏమిటి ? కలిగిన అనుభవాన్ని ఉపయో గించుకోవటం !

గోపాలం కిటికీదగ్గర నుంచున్నాడు. అందం నవ్వింది. ఇంత అందమైన అమ్మాయి ఈ పల్లెటూళ్లో ఈ గుడిసెలో ఇలా మగ్గిపోతోంది. దీనిలో బోలెడు కథ ఉంటుంది. ఇక్కడఉండి ఏదన్నా త్యాగంచేసిందేమో !

లోపలకు రమ్మని సంజ్ఞ చేసింది. కిటికీలోనుంచి లోపలకు దూకేద్దా మన్నంత ఆవేశం కలిగింది.

'నీ పేరేమిటి....'

'ఆనందం ....'

అంత మంచిపేరు పెట్టుకోవాలని తోచినందుకు గోపాలం మనసులోనే అభినందించాడు.

ఆనందం తలుపుతీసింది. 'అందమే ఆనందం....' పాటపాడింది అతని హృదయం. లోపలకు వెళ్లాడు. కుక్కి మంచం. రంగుదుప్పటి. వంకెన పాత బట్టలు వేళ్లాడుతున్నాయి. అగరువత్తి వెలుగుతోంది. పొగ తీగెలాగా సాగు తోంది....ముక్కాలపీటమీద కూర్చో పోయాడు.

'అహఁహఁ....' ఆనందం అతని చేతులు పట్టుకుని మంచంమీద కూర్చో పెట్టింది.

'మంచంమీదొద్దు ........ పీటమీద కూర్చుంటాను....' అన్నాడు గోపాలం.

'కూకో. కూకో..' అంది ఆనందం అతని చేతులు పట్టుకుని.

'కూకో..కూకో..' అన్న మాటలు అతనిచెవిలో కాకిగోల చేసినాయి. 'ఎంతటిమనిషికి ఎటువంటి గొంతు ఇచ్చాడురా దేవుడా !' అనుకున్నాడు. ఆమెను చూసి సంస్కృతంలో మాట్లాడు తుందేమో అనుకున్నాడు. అసలు సంస్కృతంలో మాట్లాడుతుం దనుకో లేదు గోపాలం.

'నీకథ విందామని వచ్చాను...'

'కత కేమొచ్చెలేగాని...యాడనుంచి వచ్చింది....'

'నీ సంగతంతా చెపితే రాసు కుంటాను...'

'ఏంటళ రాసుకునేది..శమత్కారం. ....అంతాను....'

'ఎవరునువ్వు.........ఇక్కడ ఎందు కుంటున్నావు. ఏ యేపరిస్థితులప్రాబల్యం వలన ఇక్కడ చిక్కుకున్నావు...నీకు ఎవరూలేరా..........పతిత జనోద్ధరణకు పూనుకునే పుణ్యాత్ముల కళ్లల్లో నువ్వు పడలేదా... ఎక్కడో నందనోద్యాన వనంలో రాయంచలాగా విహరించవల సిన నువ్వు...ఈ కటికనేలమీద ఇలా, ఎందుకు తిరుగు తున్నావు...పూ శయ్యల మీద పవళించ వలసిన నువ్వు..ఈకుక్కి మంచంలో పడ్డావేమిటి....అంతా చెప్పు నీ కరుణగాథ నాకు కావాలి....'

'ఏంటయ్యోవ్. ఇదంతాను...యాటి కొచ్చినావు....యాంటిసంగతి....'

'నీ కోసమే వచ్చాను.........నా కథా న్వేషణ సఫలం అవబోతోంది....చెప్పు అంతా చెప్పు....'

'పోలీసొడివా ఎట్లా....నా యవ్వారం నీ కెందుకయ్యా.'

'నేను పోలీసువాడినికాదు..భూతాన్ని కాదు....నా మాట నమ్మి అన్నీ చెప్పు... ఈ అయిదు రూపాయ లుంచుకో....'

'గట్టా రా ...దార్లోకి.........పైసలు తెచ్చావుగందా...'

'చెప్పు....నీ కథ చెప్పు ...'

'నాను సెప్పేదేంటయ్యా.... అర్థం గాదు....'

గోపాలానికి ఏంచెయ్యటానికి అర్థం కాలేదు....

ఆనందానికి అంతకంటె అర్థం కాలేదు.

ఆఖరికి 'అయ్యొచ్చేవేళయింది .... పోఅశ..' అంటూ విసుక్కుంది. గోపాలం నిస్పృహ చెందాడు.

'చెప్పరానిగాథ.... వినరానిబాధ.... ఏదోఉంది.... ఏదోఉంది.... దీనిమీదనే కథరాయాలి....' అనుకున్నాడు.

గోపాలం పొద్దునే కాలవగట్టు పక్కనే ఉన్న హోటల్లో ఐడియాల కోసం వెతుకుతుంటే ఫిలింప్రొడ్యూసరు రామయ్య వచ్చాడు.

'మీ మాట అనుకుంటుండగానే కలి శాం....'అన్నాడు.

'రండి....రండి....మీకు హీరోయిన్ వేషానికి ఎవరన్నా దొరికారా....'

'మీకు కథేమైనా దొరికిందా._'

'ఒక చెప్పలేని గాథ దొరికింది'

'చెప్పలేకపోతే వినేదెట్లాగు........ సినిమా తీసేదెట్లాగు....'

'ఆ బాధ గాథ.... చెపితే అర్థంగాదు.. రాయాల్సిందే....'

'రాద్దురుగాని నాకు హీరోయిను దొరికింది. అయితే మాటలు, పాటలు నేపథ్యంగా ఎవరిచేతన్నా అనిపించాలి'

'ఎక్కడ చూశారు....'

'రాత్రి అక్కడే ఉన్నాను....'

'నా కథకు సరిపోతుందో లేదో... నేనుగూడా చూడాలి....'

'తప్పకుండా చూద్దురుగాని.... పేరు ఆనందం....అందమె ఆనందం...'

'ఎక్కడ....ఊరిబయట గుడిసెలో నేనా....'

'మీ కెట్లా తెలుసు ?'

ఎట్లాగోఅట్లాగు తెలిసింది. ఒకళ్ళ గొప్పతనం ఒకళ్ళకి అర్థం అయినట్లు తెలిసింది.

షరా : "ఇట్లా ఎక్కడా జరగదు" అను కునేవాళ్ళు ఇదంతా ఒక 'కల'గా అనుకుంటే అభ్యంతరంలేదు. ★